# నాకు నచ్చిన నా కథ



పో. బ్రహ్మయ్య

'విషమపరీక్ష' కథ 1969 లో ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురితమైంది. ఇంకా కొన్ని కథలు, కవితలు ప్రచురితమైనవి. మద్రాసు విశ్వవిద్యాలయము నుండి బి.ఏ., బి.యల్., పట్టాలు పుచ్చుకొన్నాను. మద్రాసు న్యాయ కళాశాల ఆంధ్ర కళాసంఘం కార్యదర్శిగా, సంఘం తరఫున శ్రీ విద్వాన్ విశ్వం, దేవులపల్లి మొ. వారిచే కవిసమ్మేళనాలు, ఆచార్య ఆత్రేయ దర్శకత్వంలో శ్రీమతి షావుకారు జానకి, హేమలత మొ.వారిచే నాటక ప్రదర్శనాలు, ఘంటశాల, లీల, జిక్కి మొదలగు వారిచే గానకచ్చేరీలు ఏర్పాటు చేసాను. నాటక సమాజాలు స్థాపించి నిర్వహించాను. శ్రీ రవీంద్రనాథటాగూరు 'బలి', రాజు-రాణి., నటీ పూజ మొదలగు నాటికలు అనువదించి ప్రచురించాను. టెన్నీసు, బాట్‌మిన్‌టన్ మొదలగు ఆటలపోటీలలో పాల్గొన్నాను.

ఈ కథ వ్రాసి 12 సం॥ పైన అయినా నేటి యువతీ యువకుల 'ప్రేమ'లో వాడి వేడి తగ్గలేదు. అన్ని రకాల వారిలో 'హాస్యం' వర్ధిల్లుతూవుంది. ఈ రెంటికే ప్రతీకగా వున్నందువల్ల యీ కథ నాకు నచ్చింది.

# విషమ పరీక్ష

"అమ్మాయ్! హేమా!"

"ఏం, నాన్నా, బస్తీనుండేనా రావటం?"

అవునమ్మా. నిన్ననే రావలసింది. పెండ్లికి కావలసిన వస్తువులన్నీ కొనటంలో ఆలస్యమయింది. లోపలికి పద, చూద్దువుకానీ.

"చూడమ్మా! నీ వివాహ ఆహ్వాన పత్రికలెంత అందంగా అచ్చొత్తించానో!"

"చాలా బాగున్నాయ్, నాన్నా!"

వివాహ మహోత్స వాహ్వాన పత్రిక

స్వస్తిశ్రీ ప్లవంగ నామ సం. మాఘ బ. విదియ శుక్రవారము ఉదయము 11-23 గంటలకు మేషలగ్న పుష్కరాంశమందు, చి. సౌ. కుం. హేమలతాదేవి అను కన్యారత్నమును చిరంజీవి కమలాకరరావు అను నవరత్నమునకు........

"అరరే! పెండ్లికొడుకు పేరు మారిందేం, నాన్నా? విమలాకరరావను పేరుకు మారు కమలాకరరావని ఉందే.... అచ్చు పొరపాటేమో?"

"పొరబాటో, గ్రహపాటో, అప్పుడే కొన్ని పత్రికలు బంధువులకు పంపానే!"

"పోనీలే, నాన్నా. పేరులో ఏముంది!"

"అయ్యో, పిచ్చితల్లీ? ఈ కాలంలో ఉందేదంతా పేరులోనే. పేరు గొప్ప ఊరు దిబ్బ అని వినలేదూ? అయినా ఈ వివాహం విషయంలో నీవు మొదటినుండి ఉదాసీనంగానే ఉన్నావెందుకో? వరుడు నచ్చలేదా, ఏమమ్మా?"

"మీకు నచ్చితే నాకు నచ్చినట్లేలే, నాన్నా."


"'లే' ఏమిటమ్మా? నీ మనసులో మాటేమిటో చెప్పరాదూ?"

"అంతా ఏర్పాటు అయిపోయిందిగా— ఇప్పుడు చెప్పి మాత్రం ఏం ప్రయోజనం?"

"సరి, సరి. చదవేస్తే ఉన్న మతి పోయిందన్నట్లు, మీ చదువుకొన్న వారి వరసంతా ఇంతే. పోయి పనిమనిషిచేత సామానులన్నీ సర్దించు."

* * *

తన జీవిత చరిత్రలో ఒక నూతనాధ్యాయాన్ని ఆరంభించబోతూంది హేమలత. గత జీవితంలోని స్మృతులను నెమరువేసుకుంటూంది. తన ముందు




బల్లపై దొంతరలుగా పడిఉన్న పెండ్లిపత్రికలలో కమలాకరుని పేరు సువర్ణాక్షరాలతో మెరుస్తూ ఉంది. దానితో అతని మధుర స్నేహస్మృతి మృదువుగా మదిలో మెదలసాగింది.

ప్రెసిడెన్సీ కళాశాలలో ఎమ్. ఎ. తరగతిలో కమలాకరుడు, తాను చదువుకునేవారు. మొట్టమొదట ఆమె నాకర్షించింది అతనిలోని పరమ సరళ స్వభావం. స్ఫురద్రూపి, స్నేహశీలి అయిన కమలాకరుని కామె పరిచయం సులువుగానే లభించింది. ఆమె అందమైనదే కాదు, అతి దయార్ద్రహృదయ. తొలుత సంగీతపు పోటీలలో వారికి శ్రుతి కలిసింది. తరవాత ఒకరి నొకరు చక్కగా అర్థంచేసుకోవడంలో సన్నిహితులయ్యారు. ఇరువురూ కలిసి మెరీనా బీచికి వెళ్లేవారు. మధురమైన మాటలతో పొద్దుపుచ్చేవారు. వారిది నిష్కళంకమైన ప్రేమ అని తోటి విద్యార్థులు అనుకునేవారు. ఇలా హాయిగా దాదాపు రెండేళ్లు గడిచిపోయాయి. ఇక పరీక్షలు రెండు మాసాలు ఉన్నాయి. అప్పుడు తన తండ్రికి సీరియస్‌గా ఉందనీ, తనను రమ్మని టెలిగ్రామ్ వచ్చిందనీ, పరీక్షలకు తిరిగివస్తాననీ చెప్పి కమలాకరుడు స్వగ్రామం వెళ్లాడు. అంతే. అటుతరవాత అతని అంతు లేదు. ఆమె ఎన్నోసార్లు దీర్ఘంగా ఆలోచించింది. అతని కోసం తపించింది. ఉత్తరం వ్రాసింది. కాని, జవాబు లేదు.... అతను ఏమైనాడు? ఎక్కడున్నాడు? ఆ ప్రశ్నలు అలాగే అపరిష్కృతంగా ఉండిపోయాయి.... ఆలోచించేకొద్దీ ఆమె తల బరువెక్కిపోయింది ... కొంతసేపటి కామె "కమలాకర్, కమలాకర్!" అని గట్టిగా అరిచింది. అప్పుడే ఆ మేడగదిలో ప్రవే

ఏస్తున్న ఆమె తండ్రి ఆమె వెన్నుతట్టి, "హేమా! హేమా!" అని పిలిచాడు హేమలత ఉలికిపడి లేచింది.

"ఏమిటమ్మా! పట్టపగలే కలలు కంటున్నావ్?"

"అవును నాన్నా, నావన్నీ కలలూ, గాలిమేడలూ!"

"వట్టి కలలైతే మానె, కలవరింతలు కూడా!"

"వరించలేనివారు కలవరించక ఏం చేస్తారు?"

"అదేమిటమ్మా, నీవు వరిస్తే నే వద్దంటానా! కోడలు కంటానంటే అత్త వద్దంటుందా, చెప్పు?"

"పో, నాన్నా! మీదంతా హాస్యం. అఁ అసలు నే నేమని కలవరించా?"

"కలవరించటమేమిటి గావుకేక పెట్టేసేను! ఎవరమ్మా ఆ కమలాకర్?"

"ఎమ్. ఎ. లో నా క్లాస్‌మేట్, నాన్నా."

"అతన్ని గురించి నా కెన్నడూ చెప్పినట్లు లేదే?"

"చెప్పేదాని కేముంది, నాన్నా! అతడు అతి సామాన్యమైన వ్యక్తి."

"సామాన్యమైన వ్యక్తులు సహా స్వప్నాలలో ప్రత్యక్షమౌతారా? కొంప దిసి నీ వతన్ని ప్రేమించలేదు కదా?"

"మీకా భయమక్కరలేదులే, నాన్నా. మీరు కోరిన సంబంధానికే ఒప్పు కొన్నాగా?"

"ఆడవారి ఇష్టాయిష్టాలు ఆ భగవంతునికే ఎరుక. అరరే! మాటల్లో పడి మరిచానే– నీ కోసం ఎవరో వచ్చి కింద వేచిఉన్నారమ్మా."

"నా కోసమా? ఈ పల్లెటూరిలో? ఎవరు, నాన్నా?"

"అదే– నీకు ఇక్కడ కలలో కనబడ్డ ఆ కమలాకర మహాశయుడే అనుకుంటా."

"పో, నాన్నా! అంతా వట్టిదే. నన్ను ఆడించటాని కలా అంటున్నావు."

"అయితే సరే. ఆయనగారినే ఇక్కడికి పంపుతా, అంతవరకు నీవు నీ స్వప్నవీధుల్లో విహరిస్తూ ఉండు. నేను మళ్లీ వస్తా" అని వెళ్లిపోయాడు.

*　　　*　　　*

హేమలత గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. ఆమె మానస సాగ రంలో భావతరంగాలు లేచిపడుతున్నాయి. మేడ మెట్లపై అడుగుల చప్పుడు ఆమె ఆలోచనల కడ్డు తగిలింది. ఆ అడుగుల శబ్దం అతనిదే.

"నమస్తే" అన్న స్నేహపూరితమైన అతని శాంత గంభీర స్వరం చెవులపడగానే లత మరబొమ్మవలె లేచి నిలిచి ప్రతినమస్కారం చేసింది.

"క్షేమమా, హేమలతాదేవీ?"

"ఆఁ మీ దయవల్ల. ఆ మాట మొదట మిమ్మల్నే అడగాలనుకుంటున్నా."

"దానికేం! క్షేమంగానే ఉన్నా. లేకపోతే ఇంతదూరం ఎలా రాగలను, చెప్పు?"

"అయితే నా జాబుకు జవాబైనా లేదేమి?"

"అసలు నా కది చేరితేగా? ఈ మధ్య కాలంలో చాలా వైపరీత్యాలు జరిగిపోయాయి. అయినా ఇప్పుడు నిన్నొకసారి చూసిపోదామని వచ్చాను. అది నీకు నచ్చకపోయినా, మనసు నొచ్చినా క్షమించాలి."

"అబ్బెబ్బే! అదేమీ లేదు. పైగా, మీ రాకకు చాలా సంతోషంగా ఉంది".

"ఔను. అది నీ మొహం చూస్తేనే తెలుస్తుంది!"

"లేదు, లేదు. కులాసాగానే ఉన్నాను."

"పైకి అలా అంటున్నావే కాని నీ మనసులో బాధ అర్థమవుతూనే ఉంది."

"అయితే నా మనసు నాకన్న మీకే బాగా అర్థమవుతుందన్నమాట?"

"ఒకప్పుడలా అనుకొని చాలా గర్వపడేవాణ్ణి కూడా."

"మంచిది. నిలబడే ఉన్నారాయె. అలా కూర్చోండి."

"అలాగే. నీవు కూడా కూర్చో."

"సరే. తిరిగి వస్తానని పరీక్షలకైనా రాలేదేమి?"

"నా జీవితమే నా కొక విషమపరీక్షగా తయారైంది. ఇక ఈ పరీక్ష లెందుకూ? తీరా పరీక్షముందు మా నాన్న పోయాడు. అనుకోకుండానే ఆస్తి అంతా అప్పులపాలైపోయింది. పైగా, నాకు పెద్ద జబ్బు చేసింది. అసలు నేను బ్రతుకుతా ననుకోలేదు. వైద్యం కోసం ఊరు వదిలాను. తీరా కోలుకునేసరికి పరిస్థితులు తారుమారయ్యాయి."

"నా కో ఉత్తరం ముక్క వ్రాయకూడదా?"

"ఎందుకూ? నిన్ను కూడా బాధించడానికా?"

"మీ కష్టసుఖాల్లో భాగం పంచుకోలేని దురదృష్టవంతురాల్ని."

"నా కోసం విచారించకు. కొందరి జీవితాలు ఇలాగే తాడూ బొంగరం లేకుండా తిరిగిపోతుంటాయి. వాటికోసం విచారించి ప్రయోజనంలేదు. నీవు సుఖంగా ఉంటే అంతే చాలు!"

"సుఖమో, దుఃఖమో ఎవరి నొసట ఏమి వ్రాసి ఉంటుందో చెప్పలేం. ఊహించలేం కూడా."

"నీ మనసు మంచిది. నీ నొసట సుఖమే వ్రాసి ఉంటుంది."

"నా వివాహం నిశ్చయమైపోయిందని తెలుసా?"

"తెలిసే నిన్ను మనసారా దీవించిపోదామని వచ్చాను."

"అంతకన్నా నన్ను శపించటం మంచిది."

"ఎందుకూ? నీవు నా కేం ద్రోహం చేశావని!"

"మిమ్మల్ని ఇంత శీఘ్రంగా మరిచి, కృతఘ్నురాలి నయ్యాను."

"మరుపు మానవనైజం. మన మానసిక బాధల కదే మంచి మందు. అయినా ఇందులో నీ తప్పేముంది? ప్రతి స్త్రీ సంఘంలో తన గౌరవప్రతిష్ఠలు పెరగాలని కోరుకుంటుంది. ఒక భాగ్యవంతుడైన వ్యక్తి నీ జీవిత భాగస్వామిగా లభించటం నీ అదృష్టం కాదా?"

"ధనమున్నంత మాత్రాన అన్నీ ఉన్నట్లేనా?"

"కాకపోతే కవిగారిలా ఎందుకు సెలవిచ్చారు?

ఏ నరునకు విత్తముగల
దా నరుఁడు కులీనుఁ డధిక ధార్మికుఁ డతఁడే
దీ నిధి ధన్యుడు నేర్పరి
నానా గుణగణము కాంచనంబున నిలుచున్.

మీరూ భాగ్యవంతులే. నెయ్యమునకు, కయ్యమునకు సమత వలయు నన్నారు. అందుచేతనే ఈ సంబంధాన్ని ఏర్పాటుచేశారు మీ నాన్నగారు, నీవు సుఖపడాలనే సదుద్దేశంతో."

"ధనమున్నంత మాత్రాన సుఖపడవచ్చుననేనా మీ అభిప్రాయం?"

"నా ఒక్కని అభిప్రాయమేమిటి? అందరి అభిప్రాయమూ అదే. అందుకే 'ధనమే ప్రపంచలీల' అన్నారు. అది లేనిది అరనిముషమైనా గడవదు ఎవరికైనా. అయినా నీకు తెలియని దేముంది?"

"నన్ను పరిహసించటం లేదుకదా?"

"లేదు, లేదు. మనసారా ఆశీర్వదిస్తున్నా. నీ వివాహం నిశ్చయమై పోయిందని తెలిసే నిన్ను కడసారి చూచిపోదామని వచ్చాను. ఆ శుభసమయంలో అర్పించతలచిన నా చిన్న బహుమానాన్ని ముందుగా స్వీకరించి నన్నను్గ

హించు, దేవీ!" అని ఒక చిన్న పాలరాతి తాజమహల్ ప్రతికృతి బల్లపై పెట్టాడు.

"ఒకవేళ ఈ వివాహం ఆగిపోతే?"

"ఇప్పుడాగినా, మరొకప్పుడైనా కాకపోదు. అంతదాకా దీన్ని మన స్నేహచిహ్నంగా పెట్టిఉంచు."

హేమలత ఒక దీర్ఘనిశ్వాసం వదిలింది.

"మరి మీ వివాహం సంగతేమైనా ఆలోచించారా?"

"ఆఁ. నేను వివాహం చేసుకోతలచలేదు. దయచేసి కారణం అడగవద్దు."

"అలా అని సన్యాసం పుచ్చుకొంటారా ఈ చిన్నవయసులోనే?"

"మనిషికి ముఖ్యం వయసు కాదు, మనసు."

"అయితే మీకు మనసు లేదా?"

"అదంతా ఇప్పుడు గతజల సేతుబంధనమే గదా.... ఇక నాకు సెలవా? మీ దాంపత్యజీవితం మూడు పువ్వులూ ఆరు కాయలై వర్థిల్లాలని ఆశీర్వదిస్తున్నా," అని అతడామె జవాబుకోసం ఎదురుచూడకుండా గది బయటికి నడిచి గబగబా మేడమెట్లు దిగసాగాడు.

కమలాకరుని బుర్రలో అనేకమైన ఆలోచనలు గిర్రున తిరగసాగాయి. ఆ పరధ్యానంలో కాలు జారి పడ్డాడు. కండ్లు మబ్బులు కమ్మాయి. హేమలత తండ్రి హాలాహలరావు పనిమనిషి అచ్చి సహాయంతో అతన్ని కిందిగదిలోకి చేర్చాడు. ప్రథమచికిత్స చేసి చేర్చాడు.

హాలా: అబ్బాయీ, దెబ్బేమీ తగలలేదు కదా?

కమలా: శరీరానికేమీ తగలలేదండీ!

హాలా: స్పృహ తప్పినంత పని అయె. మరి గాయమేదైనా....

కమలా: అది మీకు కనపడదు. దాని బాధ నేను అనుభవించాల్సిందే.

అచ్చి: అయితే కనపడని గాయానికి కట్టెలా కట్టడం?

హా: ఈ చికిత్సలు మనకు తెలియవులేవే. ఈ గాయానికి ప్రత్యేకమైన వైద్యుణ్ణి రప్పించాలి. అంతేనా, అబ్బాయీ?

కమలా: వద్దండీ. కాలక్రమేణా అదే నయమైపోతుంది.

హా: ఇంతకూ నీ జబ్బేమిటి, నాయనా? నీ వెవరినైనా ప్రేమించావా?

కమలా: ఇప్పుడు చెప్పి మాత్రం ఏం ప్రయోజనంలెండి!

హే: అది కాదయ్యా, చచ్చేంత ప్రమాదం జరిగినా 'రామరామ' అనుకోక 'ప్రేమ ప్రేమ' అని కలవరించట మేమిటంటా?

కమలా: నేను చచ్చినా నాలోని ప్రేమ మాత్రం చావదు.

హే: చింత చచ్చినా పులుసు చావదన్నట్లు.

క: పేదవాని ప్రేమ పెద్దవారికి పరిహాసాస్పదం కావటం సహజమే కదా!

హే: ప్రేమకు పెద్దా చిన్నా, ధనికుడూ దరిద్రుడూ అనే భేదం లేదని కాదు టయ్యా మీ యువకుల వాదం?

క: అది నిర్వివాదమే అనుకోండి. అయినా ఆ ప్రేమకు అఘాతం కలిగినప్పుడు తట్టుకొని నిలిచే శక్తి మాలో ఏదీ!

హే: శక్తి వచ్చేవరకూ ఇక్కడే విశ్రాంతి తీసుకో, బాబూ. నీ బాధ ఏమిటో ఆ వచ్చే వైద్యునికే విన్నవించుకో. ఫీజు మాత్రం నే చెల్లిస్తాలే- దిగులు పడకు. నీకు అవసరమైనవన్నీ ఈ అచ్చి తెచ్చిఇస్తుంది. నిశ్చింతగా నిద్రపో.

* * *

హేమలత: కమలాకర్! బాధగా ఉందా?

క: లేదు.

హే: నీ బాధకంతా ఈ అభాగ్యురాలే కారణం!

క: కాదు.

హే: నాతో మనసిచ్చి మాట్లాడవా?

క: హృదయం నిండుగా ఉన్నప్పుడు మాటలు పొర్లవు.

హే: నా మీద కోపమా?

క: లేదు.

హే: మళ్లీ అదే 'లేదు', 'కాదు'— ఇక మాటలే లేనట్లు.

క: ఆ మాటలన్నీ కళాశాలలోనే ఖర్చయిపోయాయి.


హే: ఇష్టంలేకపోతే విసిగించనులే. పాలు పట్టుకురానా?

క: నీ కెందుకా శ్రమ? నా శరీరమంత నీరసస్థితిలో లేదు. స్టేషను వరకు బండి కట్టిస్తే, బయలుదేరి వెళతాను.

హే: వద్దు. కొన్నాళ్లిక్కడే విశ్రాంతి తీసుకో.

క: నాకు విశ్రాంతి శాంతి అనేవిక ఉండవు.

హే: నా అపరాధానికి పరిహారంగా నీకు ఉపచారాలు చేస్తే నా మనస్సుకు ఊరట కలుగుతుంది.




క: నేను పరాయివాణ్ణి? నాకు ఉపచారం చేస్తే, నీకు అపచారం జరుగుతుంది. భారతనారికి భర్తే భగవత్స్వరూపుడు. వివాహానంతరం నీ మనస్సుకు తృప్తి కలుగుతుంది.....

హే: సరే. అలాగయితే వివాహం జరిగేంతవరకూ నీ పక్కనే ఉండు.

శాసించినట్లని ఆమె ఆలోచిస్తూ మెల్లగా గదిబయటకు వచ్చింది. పక్క గదిలో హాలాహలరావుగారు అచ్చితో మాట్లాడుతున్నారు.

హాలా: తెలిసిందా? ఈ రాత్రికే ఈ పని ముగించాలి.

అచ్చి: క్షమించండి, బాబూ! నా వల్ల కాదు.

హా: అచ్చీ, భయపడకు. క్షణం పట్టదా పని. ఈ పొట్లంలో పొడి పాలలో కలిపి జాగ్రత్తగా అతనిచేత తాగించు.

అచ్చి: అబ్బా! విషం కలిపి ఇవ్వటం నా వల్లకాదు, బాబూ. మన్నించండి.

హా: ఇదిగో, చూడు, అచ్చీ! నీ శ్రమ వృథా చేయనులే. పని నెరవేర్చావా నీకు గొప్ప బహుమానం దొరుకుతుంది. అనుమానించకు.

అచ్చి: అయ్యగారూ! ఆయన చాలా మంచివాడిలా ఉన్నాడండి. నిష్కారణంగా నిండుప్రాణం తీయలేనండి.

హే: నిష్కారణమేమిటే! ఈ బడుద్దాయి మూలంగా అంతా సిద్ధం చేసిన పెండ్లాగిపోయి, నా మాట నీట గలిసిపోతూంటే చూస్తూ ఊరకుండ మంటావా? నా పరువు ప్రతిష్ఠలేం కావాలి, గంగలో కలిసిపోవలసిందేనా? అయినా నీవు తీసేదేముందే అతని ప్రాణం! ఆ పాలే తీస్తాయి. ఈ పొట్లం జాగ్రత్త సుమా!

అచ్చి: అయ్యగారూ! ఆయనంటే అమ్మాయిగారికి అరవ ప్రాణంగా ఉందండీ. ఆయన పోతే ఆమె బ్రతకలేదండీ.

హే: అమ్మాయంటే నాకు మాత్రం అమిత ప్రాణం కాదుటే! అది లేకపోతే నేను బ్రతగ్గలనా?

అచ్చి: అలా అయితే అమ్మాయిగారిని ఆ కమలాకరయ్యకే ఇచ్చి పెండ్లి చేయండి. ఇద్దరూ చిలకాగోరింకల్లా ముచ్చటగా ఉంటారు. పైగా, వారు ప్రేమించుకొన్నారు.

హే: ఒసే, అచ్చీ! ఈ పాడు పిచ్చి నిన్నూ పట్టుకుందటే! గుడ్డిపోయి పిల్ల నెక్కిరించినట్లు కుర్రముండవు నీవూ నాకు నీతులు నేర్పొచ్చావ్? నీ మాటలు కట్టిపెట్టి ఈ విషం చచ్చినట్లు ఇస్తావా, లేక నన్నే స్వయంగా ఇమ్మంటావా— త్వరగా చెప్పు?

అచ్చి: ఎందుకులెండి, బాబూ! పాపిష్టి ముండను. ఆ పాడుపని నా చేతల మీదనే జరగనీయండి. ఇంతకూ ఆ మారాజుకి రోజులు చెల్లే ఇక్కడికి వచ్చాడు.

హే: ఈ విషయం అమ్మాయికి తెలియనిచ్చావా నీ ప్రాణాలు దక్కవు, జాగ్రత్త!

చాటుగా వింటున్న హేమలత చలించిపోయింది. తన చెవుల్ని తానే నమ్మలేకపోయింది. తన కన్నతండ్రేనా ఈ కఠిన కార్యానికి పూనుకుంటున్నది?.... ఆమె కమలాకరుని గదిలోకి పరిగెత్తింది. నిశ్చలంగా నిద్రపోతున్న అతని ప్రశాంత సుందరవదనం చూచి ఒక దీర్ఘ నిశ్వాసం వదిలింది. అసూయా రహితమైన హృదయంతో, అవ్యాజ ప్రేమతో తన్నాశీర్వదించ వచ్చినవానికా ఈ శిక్ష? అప్రయత్నంగానే ఆమె హృదయం ప్రేమతో, జాలితో నిండిపోయింది. ఎలాగైనా సరే అతన్ని రక్షించి తీరాలని నిశ్చయించుకొంది.

* * *

జామురాత్రి గడిచింది. అయినా ఆమె అతని గదిలోనే కనిపెట్టుకొని ఉంది.

"అమ్మా! అయ్యగారికి పాలు తెచ్చాను" అని అచ్చి వచ్చింది. పాలగ్లాసు పట్టుకొని. అది చూచి హేమలత ఉలికిపడింది. వెంటనే తన్ను తాను సంబాళించు కొంది.

హేమ: అక్కడ పెట్టి వెళ్లు.

అచ్చి: పాలు చల్లారిపోతాయి. త్వరగా తాగించమన్నారమ్మా నాన్నగారు.

హే: సరే. నే ఇస్తాలే. వెళ్లి పడుకో పో.

అచ్చి: నా పాపిష్టి చేతులతో ఇస్తే పాలైనా విషమౌతాయిలే. నీ బంగారు చేతులతో ఇస్తే విషమైనా అమృతమౌతుంది అని పాలగ్లాసు బల్లపై పెట్టి వెళ్లి పోయింది.

పాలను చూచి హేమలత ఒళ్లు వణికిపోయింది. కన్నతండ్రే ఇంత కఠిన కార్యానికి పాలుపడ్డాడే అని మనస్సుకు విరక్తి కలిగింది. ఈ పాపానికి తన తండ్రికి చక్కని గుణపాఠం నేర్పాలి. జీవితాంతం వరకు జ్ఞాపకం ఉండే గుణపాఠం. తానే ఆ పాలు తాగి చస్తే తన తండ్రికి తగిన శాస్తి జరుగుతుంది. తన కీ ప్రేమలేని పెండ్లి పీడా విరగడైపోతుంది అని అనుకుంది.

కమలాకరుడు కనులు తెరిచాడు.

కమ: ఏమిటాలోచిస్తున్నావ్, హేమలతా?

హేమ: ఏమీలేదు. నీ కాకలేస్తుందా?

క: ఆఁ పాలిలా తే, గుటగుట తాగేస్తా.

హే: ఊఁ తాగేస్తావ్. తరవాత నీ ప్రాణం గుటుక్కుమంటుంది, తెలుసా?

క: ఏమిటా పరిహాసం హేమా! ఆకలితో అసురుసురవుతూ ఉంటే?

హే: ఆ పాలలో విషం కలిపారు.

క: ఆఁ! విషమే! ఎవరు కలిపారు?

హే: ప్రియమైన మా నాన్నగారే దాసీదానితో పాలలో విషం కలిపించి మీ కిమ్మని పంపారు.

క: ఈ విషయం నీ కెలా తెలుసు?

హే: మా నాన్నగారి మాటలు స్వయంగా విన్నాను.

క: మీ నాన్నగారు ఇది కూడా నీ మేలు కోసమే చేసిఉంటారు. నిన్ను పువ్వుల్లో పెట్టి పెంచారు. నీ భవిష్యత్తు కష్టాలపాలు కావటం చూచి సహిస్తారా? నా పీడ విరగడైపోతే నీ వీ పెండ్లి చేసుకొని సుఖంగా ఉంటావని

ఇలా చేసి ఉంటారు. బిడ్డలపై ప్రేమగల ఏ తండ్రి అయినా అలాగే ప్రవర్తిస్తారు. అందుకు నీవు విచారపడక ఆ పాలిలా ఇవ్వు.

హే: నే నివ్వను. అవి నేనే తాగి చస్తాను. దానితో మా నాన్నకు తగిన శాస్తి జరుగుతుంది.

క: బ్రతికి సాధించలేనిది చచ్చి సాధిస్తావన్నమాట?

హే: మరి నాకు గత్యంతరం లేదు. బ్రతికి ఉంటే ఈ పెండ్లి ఎలాగూ తప్పదు. జీవితాంతం బాధపడేకంటే ఒక్క నిముషంలో ప్రాణాలు వదలడమే హాయి.

క: మరి నీకు ఈ ఆలోచన ముందు ఎందుకు లేదు? ఇష్టంలేని పెండ్లి కెందుకు ఒప్పుకున్నావు?

హే: బలేవాడివే. నీ గతీ స్థితీ తెలుపవైతివి. ఇప్పుడు హఠాత్తుగా ఇక్కడ ఊడిపడి, మళ్లీ నన్ను ఆక్షేపిస్తున్నావ్!

క; అరరే! అయితే తప్పంతా నాదే. మరి దానికి తగిన శిక్ష మీ నాన్నగారు ప్రేమతో పంపిన ఈ పాలే— అంటూ బల్లపై నున్న పాలగ్లాసందుకొని తాగబోయాడు.


హే: అయ్యయ్యో! ఏమిటా అఘాయిత్యం? అందులో విషం కలిపారంటుంటే తాగుతానంటావా?

క: నిజంగా విషం కలిపారా, లేక నన్ను పరీక్షిస్తున్నావా?

హే: పరీక్ష కాదు, పరిహాసమూ కాదు. ముమ్మాటికీ నిజం. అందులో విషం కలిపారు___ అని, అతని చేతిలోని గ్లాసు బలవంతంగా తన చేతిలోకి తీసుకుంది.

క: అయినా ఫరవాలేదు. నా మూలంగా నీ జీవితం పాడుకావటం నా కిష్టం లేదు. నేను పోయినా అనుకునేవారు లేరు. ఆ పాలిలా తే.

హే: విను, కమలాకర్. చివరి క్షణాల్లో నిజం చెబుతున్నా. నేను నిన్ను మనసారా ప్రేమించాను. కాని, ఆ మాట నాన్నగారితో చెప్పలేకపోయాను. అది నా హృదయ దౌర్బల్యమో, విధి విలాసమో తెలియదు. కాని నేను మాత్రం ఒకరిని ప్రేమించి ఇంకొకరిని పెండ్లిచేసుకొని ఆత్మవంచన చేసుకోలేను. అంతకన్నా ఆత్మహత్యే మేలు. నన్నాపకు. నన్ను ప్రేమతో లాలించి, పెంచి పెద్దదానిని చేసిన మా నాన్నగారు పంపిన ఈ విషమిశ్రితమైన పాలను తాగి ప్రాణం విడవనీ.




కమలాకర్ ఆమె దృఢసంకల్పాన్ని అర్థంచేసుకొని హడిలిపోయి, ఉద్రేకంతో లేచి ఆమె చేయి పట్టుకొన్నాడు.

క: చూడు, హేమలతా! చచ్చే దేమంత సాహసకార్యం కాదీ రోజుల్లో. కాని బ్రతకడమే. నీవు పోతే నే నెంతటి అప్రతిష్ఠ పాలవుతానో ఒక్కసారి ఆలోచించావా? అదీకాక నేను మాత్రం నిన్ను విడిచి బ్రతగ్గలనా? అందు కోసం మనం ఇద్దరం ఒకే దారి తొక్కాలి. ఇది నిజంగా మన ప్రేమకు విషమపరీక్ష సుమా!

హే: విషమ పరీక్ష కాదు— విషపరీక్ష.

క: ఏదైనా సరే. ఆ గ్లాసు ఇలా తే. ముందు నేను సగం తాగుతా. మిగతా సగం నీవు.... అయ్యేదేదో ఇరువురికీ సమానంగానే అవుతుంది.

హే: ఒకవేళ ఆ పాలన్నీ నీవే తాగేస్తే? అందుకని ముందు నేనే సగం తాగి .... వేరే గ్లాసైనా లేదాయె ఇక్కడ........

క: ఊహూఁ నేను ముందు.

హే: అహూఁ నేను ముందు.

క: ఓ పని చేస్తే? ఆ పాలు పారబోస్తే పీడబోదూ!

హే: ఉహూఁ పాలు పారబోస్తే పెండ్లి తప్పిపోయేదెలా? నే నెలాగూ తెగించి ఇల్లు వదిలి రాలేను. ఈ పల్లెటూరిలో మాది పరువూ ప్రతిష్ఠా గల కుటుంబమాయె.

క: అయితే సరే. తాగేస్తా. ముందు నేను. గ్లాసిలా ఇవ్వు.

హే: ఉహూఁ ముందు నేను.

"ఏమిటర్రా ఆ గొడవ!" అని పొడిదగ్గుతో గదిలో ప్రవేశించారు హాలా హలరావుగారు. ఇరువురు నిశ్చేష్టులయ్యారు. వెంటనే సర్దుకొని కూర్చున్నారు.

హాలా: ఏమిటమ్మా, తొమ్మిది దాటింది. అతని కింకా పాలివ్వలేదూ?

హేమ: ఇస్తున్నా, నాన్నా. ఆయనే ఆకలిగా లేదంటూ అలస్యం చేస్తున్నాడు.

హా: ఉదయం నుండీ ఆహారమే పుచ్చుకోలేదాయె. ఆకలి కాకపోవటం ఏమిటయ్యా, పాలైనా తాగకపోతే బ్రతకడం ఎలా?

క: బ్రతకాలనే వారికే పాలూ గీలూ— నా కెందుకండీ!

హా: అయితే నీవు బ్రతకదలుచుకోలేదన్నమాట. ఇంత చిన్నవయసులో ఈ వైరాగ్యమేమిటబ్బా! ఇంతకూ విషయం ఏమిటి?

హేమ: విషయం.... విషయం....

క: పాలల్లో విషం.

హా: పాలల్లో విషమా! ఆశ్చర్యంగా ఉందే. ఏదీ. గ్లాసు ఇలా ఇవ్వండి— రుచి చూస్తా.

హేమ: వద్దు, నాన్నా! అందులో విషం కలిపారు.

హా: నీవు చూచావటమ్మా?

హేమ: లేదుకాని నాకు తెలుసు. అందులో విషముంది.

హా: ఉంటే ఉండనీవమ్మా. నా కాకలేస్తూంది. నా వంతు పాలు పిల్లి తాగింది. మీ కక్కరలేకపోతే ఆ పాలిలా ఇవ్వండి. శుభ్రంగా తాగేస్తా. ఆ విషం నన్నేమి చేస్తుందో చూస్తాగా?

హేమ: అయ్యయ్యో! వద్దు, నాన్నా!

హా: ఉండవమ్మా నీవు మరీనూ. ఈ విషాన్ని మించిన విషం నాలోనే ఉందిలే అని గ్లాసు అందుకొని గుటగుట పాలు తాగేశాడు.

హేమలత గొల్లుమంది. రావుగారు గ్రుడ్లు తేలేసి మంచంపైకి ఒరిగారు.

హేమ: అచ్చీ, అచ్చీ అని కేకలువేసింది.

పనిమనిషి పరిగెత్తుకొని వచ్చింది.

హేమ: అర్జెంటుగా పోయి డాక్టరుగారిని పిలుచుకురా. నాన్నగారు విషం పుచ్చుకున్నారని చెప్పి వెంటనే పిలుచుకొని రా. పో.

హేమలత వాళ్ల నాన్నను పట్టుకొని ఏడుస్తూ ఉంది. ఆమెను పట్టుకొని కమలాకర్ ఓదారుస్తున్నాడు. మధ్య మధ్య ధైర్యం చెబుతూ ఉన్నాడు. రావుగారి నాడి పరీక్షించాడు. ఆడుతూనే ఉంది మందంగా.

ఇంతలో సంచి పట్టుకొని డాక్టరు వచ్చాడు. శ్రీపురంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కొత్తగా పనిజేసే ఎమ్.బి.బి.ఎస్. డాక్టర్. విషయమంతా విన్నాడు. రావుగారిని పరీక్షించాడు. నాలుక చప్పరించాడు. పెదవులు విరిచాడు. విషప్రయోగమే నన్నాడు.

హేమ: డాక్టరుగారూ! మీకు పుణ్యముంటుంది. మా నాన్నను బ్రతికించండి. మీ ఫీజు ఎంతైనా చెల్లిస్తా. దయచేసి త్వరగా కానీండి.

డాక్టరు: లాభంలేదమ్మా. ఏదో ఘూటైన విషప్రయోగమే జరిగింది. పైగా, వయసుమీరినవాడు. అయినా చికిత్సచేసి చూస్తా. ఏదో ప్రయత్నించాలిగా .... ఇది సూయిసైడు కేసేమో? ముందుగా పోలీసులకు రిపోర్టు చేయడం ఎందుకైనా మంచిది అని కమలాకరునివైపు చూచాడు.

క: రిపోర్టు సంగతి తరవాత చూచుకోవచ్చు. ముందు చికిత్స ప్రారంభించండి, డాక్టర్. ప్లీజ్! ఆయన బ్రతికితే అంతే చాలు.

డాక్టరుగారు మందుసంచి విప్పేలోగా రావుగారు మెల్లగా లేచి కూర్చున్నారు.

హా: ఏమిటమ్మా ఈ హడావిడి?

అందరూ ఆశ్చర్యపోయి చూడసాగారు.

"నాన్నా" అని హేమలత తండ్రిని కౌగలించుకొని ఏడ్చింది.

హా: నా కేమయిందమ్మా? నిక్షేపంలా ఉంటే! ఊరకెందు కేడుస్తావ్?

హేమ: మీరు విషం తాగి స్పృహతప్పి పడిపోయారు, నాన్నా. డాక్టరుగారి దయవల్ల మళ్లీ బ్రతికారు.

డాక్టరు: మధ్య నా దయేమిటండీ. నేనింకా సంచి అయినా సరిగా విప్పలేదాయె.

అచ్చి: అయినా మీ హస్తవాసి అలాంటిదని అనుకుంటున్నారులెండి. మీ చేయి తగిలితే చాలు శవమైనా చివాలున లేచి కూర్చుంటుందట, నిద్రలేచినట్లు.

క: ఇప్పటికే జనాభా పెరిగి తిండిలేక చస్తుంటే, ఇక శవాలు కూడా బ్రతికితే ఒకర్నొకరు పీక్కు తినాల్సి వస్తుంది.

అచ్చి: అయినా అయ్యగారి హస్తవాసి....

హా: హస్తవాసా మీ చాదస్తమా. అలవాటు లేనందున చల్లారిన పాలు తాగితే పైత్యం బోసింది. అంతమాత్రానికే ఇంత హంగామా చేశారా!

హేమ: అయితే ఆ విషం మాట, నాన్నా?

హా: అది విషం కాదమ్మా! విటమిను 'సి' మాత్రల పొడి. మీ సత్తా తేల్చుకో డానికి నేను పన్నిన పన్నాగమే ఈ విషపరీక్ష.

క: మీ పేరులోనే కాని హాలాహలం పాలలో లేదన్నమాట! మా మంచివారండీ మీరు!

హేమ: బలే ఫూల్ చేశారు, నాన్నా, మమ్మల్నందర్నీ.

హా: అంతమాత్రం అర్థంచేసుకోలేకపోయావటమ్మా. విషంపెట్టే ఉద్దేశమే ఉంటే నీకు వినపడేటట్లు ఈ ప్లాను వేస్తానా.... పోతే, ఇక నా నిశ్చయం వినండి. ఈ ముహూర్తానికే మీ వివాహం జరిపిస్తా. ఎందుకంటే ప్రేమించి పెళ్ళిచేసుకోవటం పూర్వజన్మ పుణ్యఫలం. అందరికీ అబ్బేది కాదు. అవునా కాదా, డాక్టరుగారూ? మీరు కూడా తప్పకుండా రావాలి. మీకు వృధాశ్రమ కలిగించినందులకు క్షమించండి. ఒసే, అచ్చీ, డాక్టరు గారిని సత్కరించి సాగనంపు. డాక్టరు, అచ్చి వెళతారు.

హేమ: మీ మేలు మరువలేం, నాన్నా. మేము మీ కాజన్మాంతం కృతజ్ఞులం. ప్రేమికు లిద్దరూ రావుగారి పాదాలకు నమస్కరిస్తారు.

హా: కళ్యాణమస్తు. మీ దాంపత్యం ఆదర్శప్రాయమై, ఆనందప్రదమై ఆచంద్రతారార్కం అలరారుగాక!

